క్లుప్తంగా

విద్యార్థికి అభినందన



విద్యార్థిని అభినందిస్తున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

కోట: విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఐఎస్టీ సెకండియర్ బీటెక్ విద్యార్థి అభిషై కీర్తనపాల్ ఢిల్లీలో జరిగిన గణతంత్ర్య వేడుకల్లో గ్రూప్‌సాంగ్ విభాగంలో బంగారు పతకం, జాతీయ సమైక్యత ప్రదర్శనలో కాంస్య పతకాన్ని దక్కించుకున్నారు. దీంతో సోమవారం కళాశాల కరస్పాండెంట్ నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి కళాశాలలో విద్యార్థిని అభినందించారు. ఎన్‌సీసీ ద్వారా కళాశాలకు జాతీయస్థాయి గుర్తింపు రావడం సంతోషకరమన్నారు. ఎన్‌సీసీ అధికారి మల్లికార్జున్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎన్‌బీకేఆర్‌కు హిమ్ సంస్థ గుర్తింపు



గుర్తింపు సర్టిఫికెట్‌ను చూపుతున్న అధ్యాపకులు

కోట: విద్యానగర్ ఎన్‌బీకేఆర్ సైన్స్ అండ్ ఆర్ట్స్ కళాశాలకు హిమ్ ఇంటర్నేషనల్ సంస్థ ప్రత్యేక గుర్తింపు సర్టిఫికెట్‌ను మంజూరు చేసినట్లు ప్రిన్సిపల్ రామకృష్ణారెడ్డి తెలిపారు. సోమవారం కళాశాలలో ఆయన మాట్లాడుతూ క్వాలిటీ ఎడ్యుకేషన్, విద్యార్థులకు కల్పిస్తున్న వసతులు, విద్యార్థులు చేస్తున్న సేవా కార్యక్రమాలను గుర్తిస్తూ హిమ్ సంస్థ సర్టిఫికెట్ ఇచ్చిందన్నారు. కళాశాల కోఆర్డినేటర్ రాజేష్, అధ్యాపకులు శ్రీనివాస్, రాజ పాల్గొన్నారు.

అందుబాటులో యూరియా



యూరియా పంపిణీ చేస్తున్న వ్యవసాయ సిబ్బంది

చిల్లకూరు: మండలంలోని రైతులు రబీ సాగు కోసం అవసరమైనంత యూరియా అందుబాటులో ఉందని ఏఓ భవాని తెలిపారు. సోమవారం ఆమె ఆర్బీకేల్లో యూరియా నిల్వలను పరిశీలించారు. ఏఓ మాట్లాడుతూ అన్ని ఆర్బీకేల్లో ఇప్పటికే మూడు దఫాలుగా 900 టన్నుల యూరియా సరఫరా చేశామన్నారు. రైతుభరోసా కేంద్రాల్లో బయట మార్కెట్ కన్నా తక్కువ ధరలకే యూరియాను సరఫరా చేస్తున్నామని చెప్పారు. అనంతరం కడివేడు ఆర్బీకేలో వ్యవసాయ సహాయకులు సరిత ఆధ్వర్యంలో రైతులకు యూరియా పంపిణీ చేశారు.


ఆర్థిక సాయం



సాయం అందజేస్తున్న క్రికెట్ అసోసియేషన్ సభ్యులు

చిల్లకూరు: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఓ వ్యక్తికి సోమవారం అతడి స్నేహితులు ఆర్థిక సాయం చేశారు. మూడు రోజుల కిందట మండలంలోని పలు ప్రాంతాలకు చెందిన క్రీడాకారులు క్రికెట్ పోటీలకు వెళ్లి తిరిగి ఇంటికి వెళుతున్న క్రమంలో రామారెడ్డిపాళేనికి చెందిన చంద్ర అనే యువకుడు రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. అతడు గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. సమాచారం అందుకున్న సీనియర్ క్రికెట్ అసోసియేషన్ సభ్యులు చంద్రకు రూ.లక్ష నగదు అందజేశారు. కార్యక్రమంలో మధు, రఘు, మోహన్, వెంకటేశ్వర్లు, నాగరాజు పాల్గొన్నారు.

వైద్యశిబిరానికి విశేష స్పందన



పరీక్షలు చేస్తున్న వైద్యులు

దొరవారిసత్రం: మండలంలోని నెలబల్లిలో సోమవారం నిర్వహించిన 104 వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. వైద్యులు రోగులకు పరీక్షలు చేసి, మందులు అందజేశారు. బీపీ, షుగర్ తదితర వ్యాధులున్న రోగులకు పరీక్షలు చేసి, నెలకు సరిపడిన మందులను పంపిణీ చేశారు.కార్యక్రమంలో డాక్టర్‌చంద్రకళ పాల్గొన్నారు.

మద్యం బాటిళ్ల స్వాధీనం

చిల్లకూరు: మండలంలోని తూర్పు కనుపూరు లో మద్యం అక్రమ విక్రయాలపై సోమవారం పోలీసులు దాడులు చేశారు. ఈ దాడుల్లో 15 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకుని, ఒకరిని అరెస్టు చేశారు. పోలీసుల కథనం మేరకు.. కదిరి పట్టణానికి చెందిన అనిశెట్టి ధర్మయ్య అనే వ్యక్తి కొంత కాలంగా తూర్పుకనుపూరు ముత్యాలమ్మ ఆలయం వద్ద ఉంటున్నాడు. ఇతను మద్యం షాపుల నుంచి మద్యం కొనుగోలు చేసి ఆలయం వద్ద ఎక్కువ ధరలకు విక్రయిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. ఈ నేపథ్యంలో పోలీసులు దాడులు చేశారు. ఆ సమయంలో మద్యం విక్రయిస్తున్న ధర్మయ్యను అదుపులోకి తీసుకుని, తనిఖీ చేసి 15 బాటిళ్ల మద్యం స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

విద్య, వైద్యానికి పెద్దపీట



ప్రభుత్వాస్పత్రి భవనాల ప్రారంభోత్సవ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే సంజీవయ్య

సూళ్లూరుపేట: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్య, వైద్యానికి పెద్దపీట వేశారని ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య అన్నారు. సూళ్లూరుపేట పట్టణంలో రూ.5.13 కోట్లతో నిర్మించిన కమ్యూనిటీ హెల్త్ సెంటర్ అదనపు భవనాలను సోమవారం ఎమ్మెల్యే కిలివేటి ప్రారంభించారు. ఈ సందర్భంగా హెల్త్ సూపర్‌వైజర్ జనార్దనయ్య అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో అధ్వానస్థితిలో ఉన్న ప్రభుత్వాస్పత్రులను కార్పొరేట్ హాస్పిటళ్లను తలపించేలా అభివృద్ధి చేసిన ఘనత సీఎం జగనన్నకే దక్కిందన్నారు. సూళ్లూరుపేట ప్రభుత్వాస్పత్రిలో అదనపు భవనాలు, ఆపరేషన్ థియేటర్‌ను ఏర్పాటు చేశామని తెలిపారు. షుగర్, బీపీలతోపాటు 28 రకాల వ్యాధులను నిర్ధారించే వైద్య పరికరాలను రూ.25 లక్షలు వెచ్చించి ఏర్పాటు చేశామని తెలిపారు. అలాగే కొత్తగా డాక్టర్లను కూడా నియమించామని, గైనకాలజిస్టు, ఆర్థోపెడిక్, జనరల్ మెడిసిన్, జనరల్ సర్జన్ లాంటి స్పెషలిస్టులను కూడా నియమించామని తెలిపారు. ఇక నుంచి ఈ ఆస్పత్రి 24 గి7గా పని చేస్తుందన్నారు. జగనన్న ప్రభుత్వంలో పట్టణ ప్రాంతంలోనే కాకుండా గ్రామాల్లోని పీహెచ్‌సీలను కూడా అభివృద్ధి చేసి నిరుపేదలకు ఉచితంగా వైద్యసేవలు అందిస్తున్నారని తెలిపారు. గ్రామీణస్థాయిలో కూడా బీపీ, షుగర్ లాంటి వ్యాధులకు పరీక్షలు చేసి మందులను ఉచితంగా అందిస్తున్నారని తెలిపారు. నిరుపేదల అభ్యున్నతికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నిరంతరం కృషి చేస్తున్నారని చెప్పారు. ప్రజా సంక్షేమే ధ్యేయంగా పనిచేస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకుంటే ఇంకా ఎన్నో జనరంజకమైన పథకాలను మనమంతా చూస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి ఇన్‌చార్జి డాక్టర్ రమేష్, ఎంపీపీ అనిల్‌కుమార్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ పీ పద్మామిల్టన్, చిన్ని సత్యనారాయణ, కౌన్సిలర్లు కే లక్ష్మి, ఎస్ సౌజన్య, బీ మహే ష్, నాగేశ్వరస్వామి ఆలయ చైర్మన్ స్వామిరెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్ ఏ శ్రీధర్, పార్టీ తడ మండల అధ్యక్షుడు కే ఆర్ముగం, నేతలు జే వేణుయాదవ్, డీ లక్ష్మయ్య, పీ ప్రభాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వేలం పాటలు రేపు

వెంకటగిరిరూరల్: మండలంలోని పెట్లూరు నిమ్మ, చీనీ పరిశోధన కేంద్రంలో బుధవారం ఉదయం నిమ్మ ఫలసాయం విక్రయానికి బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు నిమ్మ పరిశోధన స్థానం ప్రధానశాస్త్రవేత్త సి మధుమతి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫిబ్రవరి 14 నుంచి 2024 ఆగస్టు 31వ తేదీ వరకు ఫలసాయానికి సబంధించి వేలం పాటలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

నేడు జగనన్న ఆరోగ్యసురక్ష

రాపూరు: మండలంలోని గుండవోలులో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైద్యులు సుదర్శనమ్మ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గుండవోలు, చుట్టుపక్కల గ్రామాల్లోని ప్రజలు జగనన్న ఆరోగ్యసురక్ష కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఉచితంగా పరీక్షలు, మందులు అందిస్తామని పేర్కొన్నారు.

ఎంఈఓ-2 సంఘం జిల్లా అధ్యక్షుడుగా శంకరయ్య



పెళ్లకూరు: మండల విద్యాశాఖ అధికారి-2 సంఘం జిల్లా అధ్యక్షుడిగా మించల శంకరయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. తిరుపతి జిల్లాకు మండల విద్యాశాఖ అధికారులు-2 సంఘం సమావేశం సోమవారం శ్రీకాళహస్తి ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. ఈ సమావేశంలో శంకరయ్యను జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా శంకరయ్యకు పలువురు ఉపాధ్యాయ సంఘాల నేతలు, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

25 మంది రక్తదానం



రక్తదాతకు సర్టిఫికెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య

సూళ్లూరుపేట: రోడ్డు భద్రతా వారోత్సవాలు సందర్భంగా సోమవారం సూళ్లూరుపేట ఆర్టీసీ డిపో ఉద్యోగులు ప్రభుత్వాస్పత్రిలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో 25 మంది రక్తదానం చేశారు. డిపో మేనేజర్ మల్లికార్జున్ ఆధ్వర్యంలో సోమవారం రోడ్డు భద్రతా వారోత్సాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించి, సుమారు 25 మంది వరకు రక్తదానం చేశారు. అయితే రక్తదానం చేసిన రక్తదాతలకు ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, నేషనల్ మజ్దూర్ గౌరవాధ్యక్షుడు, ఎంపీపీ అనిల్‌కుమార్‌రెడ్డి చేతులు మీదుగా సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ సూపర్‌వైజర్ ఏ సురేష్, డీసీ చెంచయ్య తదితరులు పాల్గొన్నారు.

పథకాలతో ఆర్థికాభివృద్ధి



మాట్లాడుతున్న కౌన్సిలర్ శంకరయ్య

వెంకటగిరిరూరల్: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో పేదలు ఆర్థికాభివృద్ధి సాధిస్తున్నారని 14వ వార్డు కౌన్సిలర్ శంకరయ్య అన్నారు. సుదర్శనం నగర్‌లోని సచివాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ఆయన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలకు మంచి జరగాలన్న ఉద్దేశంతో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పథకాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. స్థానిక సమస్యలను వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారించడానికి కృషి చేస్తానని చెప్పారు.

కండలేరులో 11.170 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో సోమవారం నాటికి 11.170 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. హెడ్‌రెగ్యులేటర్ నుంచి సత్యసాయిగంగ కాలువకు 260 క్యూసెక్కులు, పిన్నేరువాగుకు 5, మొదటి బ్రాంచ్ కెనాల్‌కు 5, హైలెవల్ కాలువకు 120, లోలెవల్ కాలువకు 360 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు.

విగ్రహ పనుల పరిశీలన





పనులు పరిశీలిస్తున్న రామ్‌కుమార్‌రెడ్డి, కలెక్టర్ లక్ష్మీశకు మొక్కను బహూకరిస్తున్న నేదురుమల్లి

వాకాడు: మండల కేంద్రంలోని బ్యారేజ్ ప్రాంతంలో ఏర్పాటు చేయనున్న దివంగత మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ నేదురుమల్లి జనార్దన్‌రెడ్డి విగ్రహ నిర్మాణ పనులను సోమవారం వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భగా రామ్‌కుమార్‌రెడ్డి ఇంజినీర్లతో సమీక్షించి పనులు నాణ్యతగా, మంచి డిజైన్‌తో త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ఆయన వెంట కే దామోదర్‌రెడ్డి, ఎన్ హిమకుమార్‌రెడ్డి, జీ సుధాకర్‌రెడ్డి, డీ నాగూర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

నేదురుమల్లి పరామర్శ

వాకాడు మండలం వావిల్లపాళెం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు పీ సుబ్బారెడ్డి కుటుంబసభ్యులను వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి సోమవారం పరామర్శించారు. సుబ్బారెడ్డి సోమవారం మృతి చెందారు. ఈ సమాచారం తెలుసుకున్న నేదురుమల్లి ఆ గ్రామానికి వెళ్లి సుబ్బారెడ్డి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మృతుడి సోదరులు వైఎస్సార్‌సీపీ నాయకులు పీ శశిరెడ్డి, కోదండరామిరెడ్డిని పరామర్శించారు.

కలెక్టర్‌తో నేదురుమల్లి భేటీ

సైదాపురం(వెంకటగిరి): తిరుపతి జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ జి లక్ష్మీశతో వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి సోమవారం తిరుపతిలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశకు మొక్కను అందజేశారు, అనంతరం వెంకటగిరి నియోజకవర్గ అభివృద్ధిపై చర్చించారు.

పంటల పరిశీలన



మాట్లాడుతున్న ఆర్‌వైఎస్‌ఎస్ సీఈఓ రామారావు

దొరవారిసత్రం: మండలంలోని వీఎంఆర్ నగర్‌లో ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో సాగు చేసి వివిధ రకాల పంటలను సోమవారం రైతు సాధికార సంస్థ(ఆర్‌వైఎస్‌ఎస్) సీఈఓ రామారావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన రైతుల అనుభవాలను తెలుసుకున్నారు. అనంతరం సీఈఓ మాట్లాడుతూ ప్రకృతి సేద్యంతో నాణ్యమైన దిగుబడులు సాధించవచ్చన్నారు. ఘనజీవామృతం, ద్రవజీవమృతం వాడకంతో భూమిలో సూక్ష్మపోషకాలు బాగా వృద్ధి చెంది మొక్కకు కావాల్సిన పోషకాలు అందుతాయన్నారు. ఇలా చేసినందు భూమి కలుషితం కాకుండా పంట దిగుబడులు బాగా వచ్చి, రైతు అధిక లాభాలు పొందవచ్చన్నారు. ప్రతి రైతూ ప్రకృతి వ్యవసాయం వైపు మొగ్గు చూపాలని కోరారు. ప్రకృతి వ్యవసాయం పద్ధతిలో వాణిజ్య పంటలతో పాటు ఆకుకూరలు, తీగ, గడ్డ జాతి పంటలు సైతం రైతులు సాగు చేసేలా సంబంధిత సిబ్బంది చర్యలు చేపట్టాలని సూచించారు. ఆయన వెంట తిరుపతి జిల్లా డీపీఎం షణ్ముగం, డీఎల్‌ఎంపీ పట్టాభిరెడ్డి, జిల్లా యంకర్ రవిచంద్ర ప్రసాద్, సిబ్బంది వెంకటేశ్వర్లు, కల్పన, స్వామికొండయ్య, రైతులు ఉన్నారు.

భూ ఆక్రమణలపై ఫిర్యాదు



రెవెన్యూ అధికారులకు వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

ఓజిలి: మండలంలోని పెదపరియ రాచపాళెంలో ప్రభుత్వ భూములు ఆక్రమణలకు గురయ్యాయని, ఆక్రమణల తొలగింపునకు చర్యలు చేపట్టాలని రెవెన్యూ అధికారులకు గ్రామస్తులు సోమవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలోని సర్వే నంబర్ 241, 241లో 40 ఎకరాలు మేతపోరంబోకు భూములు ఉన్నాయన్నారు. ఈ భూములను స్థానికుల సహకారంతో బయట వ్యక్తులు ఆక్రమించుకున్నారన్నారు. సర్వే నంబర్ 239లో చెరువు పొరంబోకు భూమిని సైతం ఆక్రమించి, జేసీబీలతో చదును చేసి చెరువుకు సాగునీరు వెళ్లకుండా అడ్డుకుంటున్నారని తెలిపారు. ఈ మేత పోరంబోకు భూములు ఆక్రమణలకు గురైతే గ్రామంలోని మూగజీవాలు మేతకు వెళ్లేందుకు ఇబ్బందులు తప్పవని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి ఆక్రమణలను అడ్డుకోవాలని కోరారు.

పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతుల కల్పన



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్

సైదాపురం: పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులను కల్పిస్తున్నట్లు తహసీల్దార్ టి ప్రవీణ్‌కుమార్ తెలిపారు. మండలంలోని గిద్దలూరు, తురిమెర్ల, ఊటుకూరు గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను సోమవారం తహసీల్దార్ పరిశీలించారు. ఎన్నికల నిబంధనలో భాగంగా పోలింగ్ కేంద్రాలను పరిశీలించినట్లు ఆయన చెప్పారు. పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులు ఉండేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ప్రధానంగా కేంద్రాల్లో విద్యుత్, తాగునీరు ఉండేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. ఆయన వెంట ఆర్‌ఐ అశ్వర్థ నారాయణ తదితరులున్నారు.

ఘనంగా కుంభాభిషేక వేడుకలు



శివలింగానికి ప్రత్యేక పూజలు చేస్తున్న అర్చకులు

వెంకటగిరిరూరల్: పట్టణంలో మనులాలాపేటలో పునర్నిర్మించిన రుద్రమూర్తిమఠం ఆలయ కుంభాభిషేక వేడకలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆలయంలో ఉదయం నుంచి ప్రత్యేక పూజలు, పుణ్యాహావాచనం, దీపారాధన, అకల్మష హోమం చేశారు. సాయంత్రం భక్తి శ్రద్ధలతో నూతన విగ్రహాల గ్రామోత్సవం నిర్వహించారు. తరువాత కుష్మాండబలి, కలశస్థాపన, కుంబ అలంకారం చేశారు. మహిళలు, భక్తులు అధిక సంఖ్యలో ఆలయం వద్దకు చేరుకుని ప్రత్యేక పూజలు చేసి, మొక్కులు తీర్చుకున్నారు.

ఎన్నికల సంగ్రామానికి సిద్ధం కండి



మేకనూరులో పర్యటిస్తున్న మేరిగ మురళీధర్



సినిమా థియేటర్ వద్ద వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో మేరిగ మురళీధర్

గూడూరురూరల్: త్వరలోనే సార్వత్రిక ఎన్నికలకు నోటిఫికేషన్ వెలువడనుందని, వైఎస్సార్ సీపీ శ్రేణులు ఎన్నికల సంగ్రామానికి సిద్ధం కావాలని వైఎస్సార్‌సీపీ గూడూరు నియోజకవర్గ సమన్వయకర్త మేరిగ మురళీధర్ కోరారు. సోమవారం ఆయన మండలంలోని మేకనూరు, అయ్యవారిపాళెం, కాంద్ర, వెందోడు గ్రామాల్లోని వైఎస్సార్‌సీపీ నాయకులతో కలసి ఎన్నికల ప్రణాళికపై నాయకులతో చర్చించారు. ఈ సందర్భంగా సమన్వయకర్త మేరిగ మురళీధర్ మాట్లాడుతూ సీఎం జగన్ మోహన్‌రెడ్డి అందించిన సంక్షేమ పథకాల లబ్ధిని పార్టీ నాయకులు, కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు సీ విజయమోహన్‌రెడ్డి, ఎంపీపీ గురవయ్య, నేతలు కే సునీల్‌రెడ్డి, ఏ శ్రీనివాసులురెడ్డి, జీ రమేష్ యాదవ్, కృష్ణయ్య, మధు, దయాకర్, సర్పంచ్ బీ వెంకటేశ్వర్లు, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

థియేటర్ వద్ద వైఎస్సార్‌సీపీ శ్రేణుల కోలాహలం

గూడూరు పట్టణంలోని కేశె సంగం థియేటర్ వద్ద వైఎస్సార్ సీపీ శ్రేణుల కోలాహలం నెలకొంది. గూడూరు జెడ్పీటీసీ సభ్యురాలు యామిని, జగనన్న సేవా సమితి అధ్యక్షుడు మహేంద్రరెడ్డి ఆధ్వర్యంలో గూడూరు రూరల్, పట్టణ పరిధిలోని వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తల కోసం యాత్ర-2 సినిమాను ఉచితంగా ప్రదర్శించేందుకు ఏర్పాట్లు చేశారు. ఈ మేరకు థియేటర్ యాజమాన్యంతో మాట్లాడి ఉదయం 11 గంటల షోకు నగదు చెల్లించి బుక్ చేశారు. ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ సమక్షంలో గూడూరు రూరల్, పట్టణ నాయకులు పెద్ద ఎత్తున తరలివచ్చి సినిమాను వీక్షించారు. నాయకులు, కార్యకర్తల రాకతో సినిమా థియేటర్ వద్ద కోలాహలం నెలకొంది. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సీఈసీ సభ్యుడు ఎల్లసిరి గోపాల్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు బీ శ్రీనివాసులు, వైస్ ఎంపీపీ శ్రీనివాసులురెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ బాబురెడ్డి, వై శ్రీనివాసులురెడ్డి, జనార్దన్‌రెడ్డి, టీ శ్రీనివాసులు, బీ గోపీ యాదవ్, అల్తాఫ్, రవీంద్రబాబు, తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ కొళాయి కనెక్షన్ ఇవ్వాలి



మాట్లాడుతున్న డీఈ మోహన్‌రావు

సైదాపురం: జలజీవన్ మిషన్ ద్వారా ప్రతి ఇంటికీ కొళాయి కనెక్షన్ ఇవ్వాలని డీఈ మోహన్‌రావు తెలిపారు. ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం జలజీవన్ కమిటీతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మండలంలోని 31 గ్రామ పంచాయతీల్లో 13 పంచాయతీల్లో జలజీవన్ మిషన్ పథకం ద్వారా ప్రతి ఇంటికీ తాగునీరు అందించే లక్ష్యంతో కొళాయి కనెక్షన్లు ఇవ్వాలన్నారు. ఆ పంచాయతీల్లో తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకోనున్నట్ల తెలిపారు. ఎంపీడీఓ సుధాకర్, ఏపీఎం రాధ తదితరులు పాల్గొన్నారు.

నీటి సమస్య పరిష్కారానికి ముందస్తు చర్యలు

వేసవి సమీపిస్తుండడంతో మండలంలో తాగునీటి ఎద్దటి లేకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నట్లు ఎంపీడీఓ సుధాకర్ తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం మండలస్థాయి అధికారులతో సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామంలో తాగునీటి సమస్య ఉందా? లేదా అనే విషయాలను పరిశీలించాలన్నారు. గ్రామాల్లో సమస్యలుంటే తమ దృష్టికి తీసుకుని వస్తే వెంటనే పరిష్కరిస్తామన్నారు. ఏఓ పురుషోత్తం శివకుమార్ పాల్గొన్నారు.

స్పందన సమస్యలకు సత్వర పరిష్కారం



తహసీల్దార్‌కు సమస్యలు విన్నవిస్తున్న అర్జీదారులు

గూడూరురూరల్: స్పందన కార్యక్రమంలో ప్రజలు అందించే వివిధ సమస్యలకు సత్వర పరిష్కారం చూపనున్నట్లు తహసీల్దార్ జి.కరుణ్‌కుమార్ తెలిపారు. రెవెన్యూ కార్యాలయంలో సోమవారం మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన ప్రజలు పలు సమస్యలపై అర్జీలు అందజేశారు. భర్త చనిపోయి రెండేళ్లు అయినా తనకు రేషన్ కార్డు లేనందున పింఛన్ రావడం లేదని ఓ మహిళ తహసీల్దార్‌కు మొరపెట్టుకుంది. దీనిపై స్పందించిన తహసీల్దార్ సమస్యను పరిష్కరించాలని సంబంధిత వీఆర్వోను ఆదేశించారు. స్పందన కార్యక్రమంలో తమ దృష్టికి వచ్చే ప్రతి సమస్యను రిజిస్టర్‌లో నమోదు చేయాలని కార్యాలయ సిబ్బందికి సూచించారు.

నీటి ఎద్దడి నివారణకు ముందస్తు చర్యలు



మాట్లాడుతున్న ఎంపీపీ శేఖర్‌రెడ్డి

పెళ్లకూరు: వేసవిని దృష్టిలో ఉంచుకుని మారుమూల గ్రామాల్లో తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందుస్తు చర్యలు తీసుకోవాలని ఎంపీపీ శేఖర్ రెడ్డి ఆదేశించారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. నీటి ఎద్దడి ప్రాంతాలను గుర్తించడం, మంచినీటి పథకాలు పాడైతే ఎప్పటికప్పుడు మరమ్మతులు చేయాలన్నారు. ప్రజలకు అధికారులు అందుబాటులో ఉండాలన్నారు. సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించడంతోపాటు తగిన సమయంలో వైద్య సేవలు అందించాలని వైద్యాధికారులకు సూచించారు. ముఖ్యంగా ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలు విషయంలో ఎక్కడా ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు నన్నం ప్రిస్కిల్లా, వైస్ ఎంపీపీ సుధారాణి, ఎంపీడీఓ సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

విశ్రాంత ఉపాధ్యాయుడికి సన్మానం



ఉపాధ్యాయుడిని సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

వెంకటగిరిరూరల్: పట్టణంలోని ఆర్వీఎం ఉన్నత పాఠశాలలో 1987-1988లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు సోమవారం ఆ పాఠశాలలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా గత మధుర స్మృతులను గుర్తు చేసుకున్నారు. అనంతరం గణిత ఉపాధ్యాయుడిగా తమకు విద్యాబుద్ధులు నేర్పిన రాపూరు మస్తాన్‌కు శాలువ కప్పి, ఘనంగా సన్మానించారు.

వెంకటగిరి ముస్లిం ఖాజీ తొలగింపు



మాట్లాడుతున్న ముస్లిం మైనారిటీ కమిటీ సభ్యులు

వెంకటగిరిరూరల్: స్థానిక ముస్లీం ఖాజీని ప్రభుత్వం తొలగించిందని ముస్లిం మైనారిటీ కమిటీ సభ్యులు ఎస్‌కే అల్తాఫ్, బాబులాల్, సయ్యద్‌హనీఫ్, షేక్ హిమామ్ బాషా పేర్కొన్నారు. పట్టణంలోని జామియా మసీదులో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. వెంకటగిరి కాజీ పనిచేస్తున్న సైపుద్దీన్ తన ఇష్టానుసారం వ్యవహరిస్తూ ముస్లింల నిఖా విషయంలో అధిక మొత్తంలో నగదు వసూలు చేయడం, అవినీతికి పాల్పడుతున్నారని ఆరోపించారు. ఈ విషయమై తమ కమిటీ సభ్యులు గతంలో పలు సార్లు అధికారులకు విన్నవించారని, ఈ మేరకు ప్రభుత్వం వెంకటగిరి ఖాజీగా సైపుద్దీన్‌ను తొలగిస్తూ ఆదేశాలు జారీ చేసిందన్నారు.

లారీ బోల్తా.. డ్రైవర్‌కు గాయాలు



డీవీ సత్రం వద్ద బోల్తా పడిన లారీ

దొరవారిసత్రం: మండల కేంద్రంలో జాతీయ రహదారిపై కట్టెల లోడుతో వెళ్లే లారీ అదుపు తప్పి బోల్తా పడి, డ్రైవర్ గాయపడిన సంఘటన సోమవారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. నెల్లూరు నుంచి చెన్నైకు ఓ లారీ కట్టెల లోడుతో బయలు దేరింది. దొరవారిసత్రం వచ్చేసరికి లారీ అదుపుతప్పి రోడ్డు పక్కనే బోల్తా పడింది. ఈ ప్రమాదంలో లారీ డ్రైవర్ గాయపడ్డాడు. ఈ ఘటనపై పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు అందలేదు.